చలివేంద్రం ప్రారంభం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కమిషనర్ వసంత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ వసంత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకుని మరో మూడు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ మాధవచారి, ఆర్‌వో వెంకటేశం, సీనియర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ వెంకటరమణరెడ్డి

శామీర్‌పేట్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని శామీర్‌పేట ఎస్ఎఫ్ఓ (స్టేషన్ ఫైర్ ఆఫీసర్) వెంకటరమణరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శామీర్‌పేట మండలం మురహరిపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రాథమిక విపత్తు సందర్భాల్లో స్పందించాల్సిన పద్ధతులను వివరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారణ ముఖ్యమని ఆయన సూచించారు.

ఎమ్మెల్యే సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి

కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని



ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వైద్య విద్యార్థిని సంధ్య

కుత్బుల్లాపూర్: అంకుటిత దీక్ష, పట్టుదలతో పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఎంబీబీఎస్ పూర్తి చేసి సత్తా చాటింది. సదరు విద్యార్థినికి ఎమ్మెల్యే వివేకానంద్ ఆర్థికంగా చేయూతనందించి ఎంబీబీఎస్ పూర్తి చేయడంలో సహకరించారు. సూరారం 60 గజాలు తెలుగు తల్లినగర్‌కు చెందిన దినసరి కూలీ ముదిగొండ లక్ష్మయ్య, లక్ష్మమ్మలకు నలుగురు సంతానం. వీరిలో మొదటి ముగ్గురు ఆడపిల్లలు (ఝాన్సీ, సంధ్య, కళ్యాణి), ఒక అబ్బాయి (ఆదిత్య). సంధ్య ఎంబీబీఎస్ చేయాలనే సంకల్పంతో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని 2019లో జరిగిన నీట్ పరీక్షలో 4,545వ ర్యాంక్ సాధించి ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ సీటును సాధించింది. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఫీజుతో పాటు పుస్తకాలను అందజేసి ఎమ్మెల్యే ప్రోత్సహించారు. దీంతో ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టా సాధించిన సంధ్య బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

ప్రభుత్వ భూములను పరిశీలించిన హైడ్రా

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 25/1లో ఉన్న ప్రభుత్వ భూములను బుధవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. ఇటీవల ఇక్కడ చోటు చేసుకుంటున్న నిర్మాణాలతో పాటు ప్రభుత్వ స్థలం ఎంత ఖాళీగా ఉంది అన్న విషయంపై ఆరా తీశారు. యాదిరెడ్డి బండ, వినాయక నర్సరీ, జర్నలిస్టులకు కేటాయించిన భూమి, అక్కడ ఇరువైపులా చేపట్టిన నిర్మాణాల వివరాలను తెలుసుకున్నారు. సెయింట్ ఆన్స్ స్కూల్ ఆవరణలోకి వెళ్లి అటు వైపుగా ఉన్న ఖాళీ స్థలం ఎంతవరకు ఉందన్న విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. హెచ్ఎండీఏకు చెందిన భూమి 25/1 సర్వే నంబర్లు ఎంత వరకు ఉంది, వాటిలో వెలసిన నిర్మాణాలు ఏమిటి? అనే అంశాలను మాత్రమే పరిశీలించినట్లుగా తెలుస్తుంది. అయితే హైడ్రా అధికారుల పర్యటన వచ్చామా.. చూశామా.. వెళ్లామా..! అన్న విధంగా వేగంగా కొనసాగింది. నర్సరీ పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టగా గతంలో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తిరిగి అదే ప్రాంతంలో నిర్మాణాలు చేయడం విశేషం. అదే విధంగా మాజీ నక్సలైట్ అంటూ ఓ వ్యక్తి ఏకంగా ఐదు ఎకరాల స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేయడంపై ఆరా తీశారు. ఇదే క్రమంలో అక్కడక్కడ జరిగిన నిర్మాణాలను పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ జరిగిన అక్రమ నిర్మాణాల విషయంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో అన్న విషయంపై స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

మహిళా సంఘాలకు మరింత దన్ను!

సెర్ప్‌లో మెప్మా విలీనం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇక రుణాల పంపిణీ, రికవరీ, పథకాల నిర్వహణ మరింత సులభం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 10,575 సంఘాలు.. 1.10 లక్షల మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బాధ్యతలు చూసే సెర్ప్, పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బాధ్యతలు చూసే మెప్మాను ఒకే గొడుగు కిందికి తీసుకురానున్నది. దీనివల్ల రుణాల పంపిణీ, రికవరీ, పథకాల అమలు, నిర్వహణ మరింత సులభమవుతుందని భావిస్తోంది. ఈమేరకు సెర్ప్‌లో మెప్మాను విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రయోజనాలు ఇలా..

విలీనంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 1,10,007 సభ్యులు ఉండనున్నారు. రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతారు. తాజాగా ఇందిరా మహిళా శక్తి మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండింటిని విలీనం చేసి ఆర్థిక స్వాతంత్ర్యం, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నది. ఇంతకుముందులా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేర్వేరుగా పథకాలు అందించడంలో ఏర్పడే సమస్యలు సైతం తొలగనున్నాయి. గతంలో గ్రామీణ ప్రాంతాలకు వ్యవ సాయ ఆధారిత పథకాలు, పట్టణాల వారికి వ్యా పార ఆధారిత పథకాలు అందించేవారు. ఇప్పుడు విలీనంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను మహిళలకు సమానంగా అందించే అవకాశం కలుగుతుంది. పక్కాగా పథకాల అమలు, మెరుగైన ని ర్వహణ, పర్యవేక్షణ దృష్ట్యా సెర్ప్‌లో మెప్మాను ప్రభుత్వం విలీనం చేస్తోందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేయడంతో మార్గదర్శకాల (గైడ్ లైన్స్) కోసం సెర్ప్, మెప్మా అధికారులు, ఉద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

10,575 సంఘాలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల ఉండగా, 1,10,007 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ప్‌లో 3,404 సంఘాలు ఉండగా 37,557 మంది , అలాగే మెప్మాలో 7,245 మహిళా సంఘాలు ఉండగా, 72,450 మంది సభ్యులు ఉన్నారు.

స్లాట్ బుకింగ్ పద్ధతిని ఉపసంహరించుకోవాలి



కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు



మేడ్చల్‌లో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్స్

కీసర: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ పద్ధతిని ఉపసంహరించుకోవాలని పలువురు డాక్యుమెంట్ రైటర్లు కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పద్ధతిని మార్చి స్లాట్ బుకింగ్ సిస్టంను ప్రవేశపెడుతుందని, దీనివలన రాష్ట్రంలోని దాదాపు 30 వేల మంది డాక్యుమెంట్ రైటర్లు రోడ్డున పడుతామన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట..

మేడ్చల్‌రూరల్ : మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్స్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సమస్యలు తలెత్తుతున్నాయని, పలు రకాల ప్లాట్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఆప్షన్ లేవని దీంతో కొన్ని ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కొత్త విధానంలోనే రిజిస్ట్రేషన్ చేయాలనుకుంటే అన్ని ఇబ్బందులకు పరిష్కారం చూపాలని లేకుంటే పాత చెక్ స్లిప్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

పోచారంలో..

పోచారం: స్లాట్ బుకింగ్ విధానాన్ని నిరసిస్తూ నారపల్లిలోని డాక్యుమెంట్ రైటర్లు షాపులు మూసివేశారు. మంగళ, బుధవారాల్లో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు తెరుచుకోకపోవడంతో రిజిస్ట్రేషన్లు సైతం జరగలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజలకు ఇబ్బందులు తప్పవని డాక్యుమెంట్ రైటర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్లాట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆవిర్భావం



కలెక్టరేట్‌లో వివిధ ఉద్యోగ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

సాక్షి,సిటీబ్యూరో: ఉద్యోగులపై ఒత్తిళ్లు, వాగ్దానాల అమల్లో జాప్యం, ఆర్థిక సమస్యల నేపథ్యంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు సంయుక్తంగా జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ (టీఎన్‌జీవోస్)పేర్కొంది. ఈ మేరకు మేడ్చల్ కలెక్టరేట్‌లో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ జిల్లా చైర్మన్ బి.రవి ప్రకాశ్,సెక్రటరీ జనరల్ జి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అన్ని సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కమిటీ ఉద్యమిస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ఇప్పటివరకు స్పందించలేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డుల అమలు లేకపోవడం, జీపీఎఫ్‌లు సమయానికి జమ చేయకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. జేఏసీ కమిటీలో వివిధ అధికార, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వై.రమేశ్వర్ గౌడ్, బి.భరత్ కుమార్, ఎ.కురుమూర్తి, బి.వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, పి.సుధాకర్, పి.రాఘవేందర్, పి.రాజు, శ్రీనివాస్, మోహన్ రావు, హెచ్.కె.సంతోషి, కె.ఆర్.రవి కుమార్, సృజన, జగదీశ్వర్, రాజ్‌కుమార్, సామ్యుయెల్ పాల్, విజయలక్ష్మి, ఆనంద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, డి.రవీందర్, ఈ.ఎస్.ఎస్.గిరి కాంత్, బ్రహ్మచారి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, వినోద్ కుమార్, నజీమా, సునీత కె.భాస్కర్ గౌడ్, కార్తీక్, యాదగిరి, మాణిక్యం, వేణు గోపాల్, శ్రీధర్, రవియాదవ్‌కు స్థానం కల్పించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఉప్పల్ కల్యాణపురిలో ప్రభుత్వ స్థలంలోని ప్రహరీని తొలగిస్తున్న అధికారులు

ఉప్పల్: మండల పరిధిలోని సర్వేనంబర్ 789 కల్యాణపురిలో ప్రభుత్వం స్థలంలో నిర్మించిన ప్రహరీని ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేశారు. ఈ స్థలంలో అక్రమంగా ప్రహరీని నిర్మించడమే కాకుండా లోపల నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి లోపల వెలసిన మూడు నిర్మాణాలతో పాటు ప్రహరీని నేలమట్టం చేశారు. ఈ స్థలం దాదాపుగా 1100 గజాలకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వాణిరెడ్డి హెచ్చరించారు. ఆర్ఐలు శాంసన్‌పాల్, అశ్వినీగౌడ్, జూనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో దేశంలోని కోట్లాది మంది పేద ప్రజలు లబ్ధిపొందుతున్నారని బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసు అన్నారు. బుధవారం సుభాష్‌నగర్ డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గావ్ చలో – బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు సాయిబాబా నగర్ బొడ్రాయి, సంతోష్ నగర్, దయానంద నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాండు బస్తీ కాలనీ వ్యవస్థాపకులు పాండు, బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ గిరిబాబు, సీనియర్ నాయకులు విఘ్నేష్ ముదిరాజ్, శారదా పాల్గొన్నారు.

నాన్ డ్యూటీ లిక్కర్‌పై దృష్టి సారించండి

సాక్షి,రంగారెడ్డి జిల్లా: హైదరాబాద్‌లో నాన్ డ్యూటీ లిక్కర్‌పై ఎక్సైజ్ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి. దశరథ్ ఎక్సైజ్ సిబ్బందిని ఆదేశించారు. ఆబ్కారీ భవన్‌లో రంగారెడ్డి డివిజన్ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు. ప్రధానంగా రంగారెడ్డి డివిజన్‌లో నాన్ డ్యూటీ పేడు లిక్కర్ డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. వీటికి తోడు ఎప్పటికప్పుడు ఎండిపిఎల్ నాన్ డ్యూటీ పైడ్ లిక్కర్ వినియోగించే ఫాంహౌస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టి అక్రమ మద్యాన్ని అరికట్టాలని సూచించారు. కేసుల చార్జిషీటు వెంటనే వేయాలని, పట్టుకున్న వాహనాలను వేలం వేయాలని ఆదేశించారు. సమావేశంలో శంషాబాద్, సరూర్ నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, కే నవీన్, ఫయాజుద్దీన్, విజయ్ భాస్కర్ గౌడ్‌తో పాటు ఎస్టీఎఫ్ టీంలు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ సూపర్‌వైజర్‌పై దాడి..

కార్పొరేటర్‌పై కేసు నమోదు

మల్కాజిగిరి: హార్టికల్చర్ విభాగం సూపర్‌వైజర్‌పై కార్పొరేటర్ దాడి చేసిన ఘటనలో మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసు నమోదైంది. బాధితుడు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి సర్కిల్ అర్బన్ బయోడైవర్సిటీ (హార్టికల్చర్) విభాగంలో సాయినాథపురానికి చెందిన వెంకటేష్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఇంట్లో నివసిస్తున్న మహిళ తన ఇంటి వద్ద ఉన్న చెట్టుకొమ్మలు తొలగించమని రెండు నెలలుగా చెప్పినా తొలగించడం లేదని, కార్పొరేటర్‌కు వివరించింది. దీంతో ఆయన సూపర్‌వైజర్‌ను పిలిపించి అడగగా.. 11 కేవీ విద్యుత్ వైర్లు ఉండటంతో కొమ్మలు కొట్టేందుకు ఇబ్బందులు వస్తాయని సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహించిన కార్పొరేటర్ వెంకటేష్‌పై పలుమార్లు చేయి చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీగణపతి వార్షిక బ్రహ్మోత్సవాలు

అల్వాల్: కానాజిగూడలోని మరకత లక్ష్మీగణపతి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం అంకురార్పణ అనంతరం లక్ష్మీగణపతి, కుబేర, సుదర్శన,, సరస్వతి, సుబ్రహ్మణ్య, రుద్ర, చండీహోమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి తెలిపారు. స్థానిక భక్తులు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి : డివిజన్ విఘ్నేశ్వరనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా జరగని అభివృద్ధి కేవలం నాలుగేళ్లలో చేసి చూపించామన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ మధురిమ, విఘ్నేశ్వరనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి



సహపంక్తి భోజనం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆ మహనీయుడికి మనం అందించే అసలైన గౌరవమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ జయంతి వారోత్సవాలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని దళిత వాడలో బీజేపీ 40వ బూత్ అధ్యక్షుడు ముక్కిడిగాళ్ల మహేశ్ ఇంట్లో నాయకులతో కలిసి బుధవారం ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో పాటు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమ న్యాయం ఉండాలని తన జీవితాన్ని అంకితం చేసిన ప్రపంచ మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు కృష్ణగౌడ్, అర్జున్ బాబు, నవనీత, కవిత, నవీన్, గణేశ్ రెడ్డి, శాంతన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సంస్కృత శిక్షణ శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న సాక్రీఫైజ్ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లికార్జునరావు

కీసర: సాక్రీఫైజ్ సంస్థ ఆధ్వర్యంలో 3 నెలల పాటు ఉచిత సంస్కృత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సోషల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్ ఫర్ ఇంటర్ కాంటినెంటల్ ఎక్స్ఛేంజ్ (సాక్రీఫైజ్) సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. తిమ్మాయిపల్లిలోని వాల్మీకి ఆశ్రమంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, వసతి సహా సంస్కృతంలో చదవడం, రాయడం, మాట్లాడడం వంటి నైపుణ్యాలు నేర్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి నెలకు రూ.15 వేల వేతనంతో ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే డిగ్రీ, పీజీ స్థాయిలో సంస్కృత కోర్సులు చదివే అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ఇంటర్ లేదా డిగ్రీ ఆపిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు సంస్కృతంపై ఆసక్తి ఉండాలని, ఏదైనా భాష చదవడం, రాయడం వచ్చేవారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 20 రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ అని, 28 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

కీసర: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అంతేగాకుండా 9 నెలలు గడుస్తున్నా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించలేదని ప్రమాదాల బారిన పడిన కార్మికులకు ఆర్థిక సాయం కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

ఆస్తి పంపకాల్లో వాటా కోసం..

- చిన్నబామ్మర్ది కోసం రెక్కీ ఏర్పాటు చేసిన బావ, సోదరి
- నలుగురిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు


ఘట్‌కేసర్: ఆస్తి పంపకాల్లో వాటా కోసం రెక్కీ ఏర్పాటు చేసిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన బోనాల రాజశేఖర్, ఈశ్వర్ తమ సోదరి లావణ్యను కొండాపూర్ మసీదుబండకు చెందిన మేడ్చల్ శ్రీనివాస్‌తో వివాహం జరిపించారు. ఆ సమయంలో రూ. 12 లక్షలు, ఎకరం భూమి కట్నకానుకలుగా ఇచ్చారు. అయితే తర్వాత తండ్రి పెంటయ్య ఉద్యోగ విరమణతో వచ్చిన డబ్బులోనూ తనకు వాటా కావాలని సోదరి లావణ్య సోదరులను డిమాండ్ చేసింది. దీంతో ఇచ్చిన ఎకరం భూమి విక్రయించిందని, తిరిగి డబ్బులు ఇచ్చేది లేదనడంతో గొడవ ప్రారంభమైంది.

బామ్మర్దుల కదలికలపై రెక్కీ..

బామ్మర్దుల కదలికలు తెలుసుకునేందుకు బావ శ్రీనివాస్ టోలీచౌక్‌కు చెందిన బాబు షేక్ సాహెల్ (20), ఎండీ ఇర్ఫాన్ (20), మహమ్మద్ అబ్బు, సల్మాన్(18)తో పాటు మరో మైనర్‌తో రూ.15 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ. 1000 చొప్పున 3 సార్లు గూగుల్ పే ద్వారా పంపించి చిన్నబామ్మర్ది ఈశ్వర్, ఇంటి, లొకేషన్ ఫొటోలు శ్రీనివాస్ ఇర్ఫాన్‌కు అందజేశాడు. బుధవారం ఉదయం వారు అంకుషాపూర్ గ్రామంలో బైక్ నంబర్ కనిపించకుండా జాగ్రత్త పడడం, ముఖాలకు మాస్క్‌లు ధరించి అనుమానాస్పదంగా రెక్కీ నిర్వహిస్తుండగా స్థానికులు వారిని పట్టుకొని ఫోన్ తనిఖీ చేయగా బావ శ్రీనివాస్ పంపిన ఫొటోలు, ఫోన్లో టచ్‌లో ఉన్నట్లు గుర్తించడంతో డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి 4 ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారితో పాటు బావ శ్రీనివాస్, సోదరి లావణ్య పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. గతంలోనూ రెక్కీ నిర్వహించిన విషయమై ఇప్పటికే ఓ కేసు నడుస్తోంది. రెక్కీ ఎందుకు నిర్వహించారు..? హత్యాయత్నం కోణం ఉందా..? అనేది పోలీసుల దర్యాప్తులో తేలనున్నది.

చిన్నారులపై వీధికుక్కల దాడి

చెంగిచర్లలో 10 రోజుల్లోనే ముగ్గురిపై దాడిచేసిన వైనం



బోడుప్పల్: చెంగిచర్లలోని ఎంఎల్ఆర్ కాలనీలో 10 రోజుల్లోనే ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో కాలనీవాసులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఈనెల 6న రుద్రాక్ష (4) సాయంత్రం పూట ఆడుతున్న సమయంలో అతడిపై వీధి కుక్క దాడి చేసింది. 12న అదే రోడ్డులో మద్ది వైభవ్ (4)పై కూడా దాడిచేసిందని చిన్నారుల తండ్రిదండ్రులు వాపోయారు. అదే కాలనీలోని వీధి నంబరు– 2లో బండం కృతిక (3) మంగళవారం సాయంత్రం ఆరు బయట రోడ్డుపై ఉండగా ఓ కుక్క దాడి చేసింది. దీంతో భయపడిన చిన్నారి గట్టిగా అరవడంతో స్థానికులు కాపాడారు. కాలనీవాసులు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం



లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్, గాంధీనగర్ కాలనీలోని సన్నబియ్యం లబ్ధిదారు పూర్ణిమ ఇంట్లో బుధవారం ఆమె భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు పేదల సంక్షేమం కోసం అదనపు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. భవిష్యత్తులో పేదల జీవితాల్లో మార్పు దిశగా అనేక పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. సన్నబియ్యం పథకం పేదలు, మధ్యతరగతి కుటుంబాల్లో ఊరటనిచ్చిందన్నారు. గోపాల్ యాదవ్, రాజుగౌడ్, పాండు, కేపీఎల్ఎస్‌రావు, రాఘవేందర్‌గౌడ్, సత్తమ్మ, నవనీత, రామారెడ్డి, మున్ని, గిరిజ, వాణిశ్రీ తదితరులున్నారు.